## ముగిసిన ప్రభాకర్‌రావు విచారణ

### 11న మళ్లీ రావాలన్న సిట్ అధికారులు

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ నేతృత్వంలోని ప్రత్యేక విచారణ బృందం సోమవారం విచారించింది. జూబ్లీహిల్స్‌లో సుమారు 8 గంటల పాటు ప్రభాకర్‌రావును ప్రశ్నించిన సిట్ బృందం ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. కోర్టులో వినిపించిన వాదనలనే ప్రభాకర్‌రావు తిరిగి సిట్ ముందు కూడా వినిపించినట్లు తెలిసింది. తాను ఫోన్‌ట్యాపింగ్‌కు ఏ అధికారికి ఆదేశాలు ఇవ్వలేదని, అలా చెప్పినట్లు ఆధారాలు చూపించాలని సిట్ అధికారులను ఆయన కోరినట్లు సమాచారం. తాను ఎస్ఐబీలో పనిచేస్తున్నప్పటికీ తన పై అధికారులకు తాను చేసిన ప్రతీ పని తెలుసని ఆయన స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం. ఎస్ఐబి కార్యాలయంలో ధ్వంసమైన హార్డ్ డిస్క్ విషయంలో తాను 2023 డిసెంబర్ 4 సాయంత్రం నాలుగు గంటలకు రాజీనామా చేశానని, అదేరోజు రాత్రి 8 గంటలకు హార్డ్ డిస్క్‌లు ధ్వంసం అయితే తనకేంటి సంబంధం అని ప్రభాకర్‌రావు ప్రశ్నించారు. అంతేకాకుండా ఫోన్ ట్యాపింగ్‌పై రివ్యూ కమిటీ ఉంటుందని ఆ కమిటీలో తాను సభ్యుడినే కాదని చెప్పారు. అసలు రివ్యూ కమిటీ సభ్యులను ఈ కేసులో ఎందుకు ఇన్‌వాల్వ్ చేయడం లేదంటూ సిట్ అధికారులను ప్రభాకర్‌రావు ప్రశ్నించినట్లు సమాచారం. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 7 గంటలకు ముగిసింది. ఈనెల 11న మరోసారివిచారణకు రావాలంటూ ప్రభాకర్ రావును సిట్ అధికారులు కోరినట్లు సమాచారం.

## నిధులు విడుదల చేయాలి

బంజారాహిల్స్, జూన్ 9: రెడ్డి కార్పొరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేయడంతో పాటు నిధులు విడుదల చేయాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన రెడ్డి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సంఘం సభ్యుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, చక్రధర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

## సిరితలపుల శతకం ఆవిష్కరణ

ముషీరాబాద్, జూలై 9: వంశీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో స్వాతి జంగా రచించిన సిరితలపుల శతకం పుస్తక ఆవిష్కరణ సభ సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ సభలో జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి ఎస్.వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రముఖ రచయిత్రి కేవీ కృష్ణకుమార్తితో కలిసి సిరితలపుల శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వంశీ ప్రవాస భారతీయ సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు సాహిత్యంపై మక్కువతో రచనలుచేయడం అభినందనీయమన్నారు.సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాణి ఉప్పల, శ్రీపేరి, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, సుధాదేవి, శైలజ, రామకృష్ణ పాల్గొన్నారు.

# నగరంలో మళ్లీ అలజడులు

**అదుపు చేయడంలో పోలీసు వ్యవస్థ విఫలం!**



ఘర్షణలో తగలబడుతున్న డీసీఎం

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): దశాబ్దకాలం పాటు ప్రశాంతంగా ఉన్న నగర వాతావరణం.. పాలకుల అసమర్థత, పోలీసు శాఖ నిఘాలోపంతో ఉద్రిక్తంగా మారుతోంది. ఆయా ప్రాంతాల్లో నెలకొంటున్న అలజడులతో శాంతిభద్రతల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల పరిధిలో జరిగిన సంఘటనలే నిదర్శనం. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి నగరంలోని ముషీరాబాద్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లిలోని వాంబే కాలనీలో అలజడులు ఏర్పడటంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గతంలో సికింద్రాబాద్, బేగంపేటలో జరిగిన ఘటనతో కూడా దాదాపు వారం రోజుల పాటు స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే.

### తక్షణమే స్పందిచకపోవడం..

గతంలో ఏక్కడైనా ఏదైన సంఘటన జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివాదాన్ని ఆదిలోనే అడ్డుకునేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి మైలార్‌దేవ్‌పల్లి ఘటనలో ఇరువర్గాలు గుమిగూడటం, రెండు డీసీఎంలకు నిప్పు పెట్టేంత వరకు పరిస్థితులు వెళ్లాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక అత్తాపూర్ ఘటనలో సైతం ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడటంతో పాటు రాళ్లు రువ్వుకోవడం, పోలీసులూ గాయపడటం వరకు వెళ్లిందంటే నగరంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం అవుతోంది. ఇక ముషీరాబాద్ ఘటనలో సైతం రెండు వర్గాల వారు పరస్పరం దాడులకు పాల్పడటం, రాళ్లు రువ్వుకోవడం వంటి పరిస్థితి ఏర్పడటానికి పోలీసు శాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లుకనిపిస్తోందని విమర్శలున్నాయి.

### అత్తాపూర్‌లో ఉద్రిక్తత..

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లయ్య టవర్స్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చిన్నపాటి విషయమై తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. దీంతో ఇరువర్గాల వారు ఆగ్రహావేశాలకు గురై పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో పోలీసు సిబ్బంది మధుకర్, శివకుమార్ గాయపడగా, పోలీస్ వాహనం కూడా ధ్వంసం అయినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన సిబ్బందిని అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

### మైలార్‌దేవ్‌పల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్థరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు డీసీఎం వాహనాలకు నిప్పంటించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. చిన్నపాటి విషయమై జల్‌పల్లి నుంచి వస్తున్న డీసీఎం డ్రైవర్లతో గుర్తుతెలియని యువకులు వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో డ్రైవర్లు, యువకుల మధ్య తలెత్తిన వివాదం పెద్దదిగా మారడంతో కోపోద్రిక్తులైన గుర్తుతెలియని వ్యక్తులు డీసీఎం వాహనాలకు నిప్పు పెట్టారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు యత్నించగా కొందరు దుండగులు పోలీసుల పైకి రాళ్లు రువ్వారు. దీంతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఘటనా స్థలికి చేరుకుని స్థానికంగా గుమిగూడిన యువకులను చెదరగొట్టి, భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఇదిలా ఉండగా వాహనాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ కొంతమంది మైలార్‌దేవ్‌పల్లి ఠాణాను ముట్టడించేందుకు యత్నించారు. సైబరాబాద్ సీపీ మహంతి వారిని సముదాయించి, జరిగిన నష్టానికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని, దాడిచేసిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలపడంతో ఆందోళనకారులు శాంతించారు. ఇదిలా ఉండగా ముషీరాబాద్‌లో ఒక వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో ఓ వర్గం వారు ముషీరాబాద్ ఠాణాకు చేరుకుని ధర్నా నిర్వహించారు. దీంతో పోలీసులు పోస్టు పెట్టిన యువకుడిని గుర్తించి అరెస్టు చేశారు.

# ఇక మాన్‌సూన్ హైడ్రాకు

(మొదటిపేజీ తరువాయి)

చేయడం, వెనువెంటనే జీహెచ్ఎంసీ నుంచి హైడ్రా పరిధిలోకి మాన్‌సూన్ ఎమర్జెన్సీ పనులను అప్పగించడం గమనార్హం.

### సమన్వయం సాధ్యమేనా?

వర్షాకాల సమస్యలను సమర్థవంతంగా నిర్వహించడంలో గ్రేటర్ డిస్కం, జీహెచ్ఎంసీ, పోలీస్, జలమండలి, హైడ్రా శాఖలు అత్యంత కీలకం. అయితే ఇప్పటికే వర్షాలు పడుతున్న దరిమిలా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ సరిగా లేక లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. వాస్తవంగా జీహెచ్ఎంసీ ప్రతి ఏటా మే చివరి వారం నాటికల్లా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలి. ప్రతి ఏటా దాదాపు రూ.33 కోట్లతో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ చేపట్టాల్సి ఉంది. ఏరియాల వారీగా 140 బృందాలు, ప్రత్యేక వాహనాలు, స్టాటిక్ లేబర్స్, మినీ మొబైల్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఐఆర్టీ పనులకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సిన అధికారులు జాప్యం చేశారు. తాజాగా హైడ్రాకు ఈ పనులు అప్పగించడం, టెండర్ ద్వారా ఈ పనులను అప్పగించడం, తక్కువ సమయంలో ఇతర శాఖల సమన్వయం ఏ మేర సాధ్యమవుతుందో హైడ్రాకు సవాల్‌గా మారిందన్న చర్చ జరుగుతున్నది.

# మల్కాజిగిరిలో టీవీఎస్ షోరూమ్



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూన్ 9: ప్రముఖ ఆటోమొబైల్ డీలరైన ఆదర్శ మోటార్స్ మల్కాజిగిరిలోని మారుతీనగర్‌లో సోమవారం తమ నూతన టీవీఎస్ షోరూమ్, నూతన వర్క్‌షాప్‌ని ప్రారంభించింది. రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా కొత్త షోరూమ్‌ని ప్రారంభించగా, టీవీఎస్ మోటార్స్ కంపనీ జనరల్ మానేజర్ కేంద్రజ్ జోషి కొత్త వర్క్‌షాప్‌ని ప్రారంభించారు. అలాగే టీవీఎస్ మోటార్స్ ఏరియా మేనేజర్ విషాల్ విక్రమ్ సింఘ్, ఏరియా సర్వీస్ మేనేజర్ వరుణ్ గుప్త.. స్పేర్ పార్ట్స్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెదటి మోటార్ సైకిల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ కస్టమర్‌కి అందజేశారు. ఆదర్శ మోటార్స్‌కి తెలంగాణలో ఇది 4వ అతిపెద్ద షోరూమ్ అని హైదరాబాద్‌లో ఇది మెదటి షోరూమ్ అని, దాదాపు 8వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ షోరూమ్‌ని రూపొందించామని, ఇక్కడ సేల్స్‌తోపాటు సర్వీస్, స్పేర్ పార్ట్స్ కూడా అందుబాటులో ఉంటాయని షోరూమ్ మేనేజ్‌మెంట్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.




సోమవారం రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్‌లో అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ ప్రతినిధులు

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో మాక్ డ్రిల్



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ సీవీ ఆనంద్, అధికారులు

సిటీబ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): బహుళ అంతస్తుల్లో నివాసముంటున్న వారు, విధులు నిర్వహించే వారు.. ఆ భవనంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం, అగ్నిమాపక భద్రతా పరికరాలు ఎక్కడున్నాయో తెలుసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (డీజీ) సీవీ ఆనంద్ సూచించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(టీజీఐసీసీసీ) డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో అగ్నిమాపక శాఖతో పాటు ఆరోగ్య శాఖ, మున్సిపల్, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఆర్అండ్‌బీ, విద్యుత్, 108 అంబులెన్స్, వాటర్ వర్క్స్, నగర పోలీస్ విభాగంలోని ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు పాల్గొన్నాయి.

### అప్రమత్తత అవసరం..

టీజీఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులలో భవనంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలా సురక్షితంగా కాపాడాలి, స్వచ్ఛందంగా తమను తాముగా ఎలా కాపాడుకోవాలనే విషయాలపై డ్రిల్ నిర్వహించారు. 83.26 మీటర్ల ఎత్తున్న టీజీ ఐసీసీసీ భవనంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ముందుగా మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించాలని, అలాగే అందులో ఉన్న సిబ్బంది అగ్నిమాపక భద్రతా సౌకర్యాలకు సంబంధించిన పరికాలు ఎక్కడున్నాయో, ఎలా ఉపయోగించాలనే విషయంలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఫ్లోర్‌లో ఒక ఫైర్ మార్షల్ అతనికి అసెస్టింట్ నియమిస్తామని అత్యవసర పరిస్థితులలో ఎలా వ్యవహారించాలనే విషయంపై వాళ్లు ఉద్యోగులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను ప్రతీ నెల మొదటి శనివారం నిర్వహిస్తామని కమలాసన్‌రెడ్డి తెలిపారు.

### అత్యుత్తమ ప్రమాణాలతో ..

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ మాక్ డ్రిల్ చాలా ముఖ్యమైందన్నారు. టీజీ ఐసీసీసీ భవనం పూర్తిస్థాయిలో అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నిర్మించబడిందని, ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలంలో మధ్యలో ఈ భవనం నిర్మించడం వల్ల అత్యవసర పరిస్తితులలో ఫైర్ ఇంజన్లు, 108 వాహనాలు సులభంగా చేరుకుంటాయన్నారు. ఈ భవనానికి ప్రతి టవర్‌కు రెండు ప్రదేశాలలో మెట్లు ఉన్నాయని అన్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో 2వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, అత్యవసర సమయంలో లిఫ్టులు కూడా వాడకుండా మెట్లదారులను ఎంచుకోవాలని సీవీ ఆనంద్ సూచించారు. అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, డీసీపీలు అపూర్వరావు, పుష్ప, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హెచ్ సిటీ పట్టాలెక్కేనా?

(మొదటిపేజీ తరువాయి)

28 ఫ్లై ఓవర్లు, 13 అండర్‌పాస్‌లు, నాలుగు ఆర్వోబీలు, మూడు చోట్ల ఆర్‌యూబీలు, పది చోట్ల రహదారుల విస్తరణ పనులకు గానూ టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉండగా..నేటికీ టెండర్ దశలోనే ఉన్నాయి. 13 చోట్ల పనులకు టెండర్లు పిలవగా, వివిధ దశల్లో ఉన్నాయి. మరో 15 చోట్ల పనులకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా 30 చోట్ల పనులకు మాత్రం ప్రతిపాదన దశలోనే ఉండడం గమనార్హం. కాగా రూ. 780కోట్ల నిదులు ప్రభుత్వం ఇస్తే కానీ భూ సేకరణ ముందడుగు పడని పరిస్థితి నెలకొంది. మరోవైపు బడ్జెట్ కేటాయింపులో భాగంగా ఇటీవల రూ. 1300 కోట్ల మేర జీహెచ్ఎంసీకి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన హెచ్ సిటీ ప్రాజెక్టులో ఎలాంటి కదలిక లేకపోవడం గమనార్హం.

### పేరు మార్చారు..

### ట్రాఫిక్ సమస్యను పెంచారు

'హైదరాబాద్ నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...బడ్జెట్‌లో రూ.10వేల కోట్లకు పైగా నిధులు ఇచ్చాం...రూ. 7032 కోట్లతో హెచ్ సిటీ ప్రాజెక్టు ద్వారా 58 ప్రాజెక్టులు చేపడుతున్నాం..' బడ్జెట్ కేటాయింపుల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన గొప్ప ప్రకటనలు..కానీ ఆచరణలో మాత్రం ఎక్కడ కూడా ప్రాజెక్టు పనులు పట్టాలెక్కలేదు.. 17 నెలల కాలంగా టెండర్ దశను దాటలేదు.. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి పేరిట కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పథకాల స్థానంలో కాంగ్రెస్ సర్కారు 'హెచ్ సిటీ'(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూపకల్పన చేసింది. ద్విగిజయంగా గత ప్రభుత్వ పథకాల పేర్లను సక్సెస్‌ఫుల్‌గా మార్చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై ఆ స్థాయి ఫోకస్ పెట్టలేకపోయింది. ఫలితంగా జీహెచ్ఎంసీ పరిధిలో అభివృద్ధి కుంటుపడింది. గడిచిన 17 నెలలకు పైగా ఒక్క కొత్త ప్రాజెక్టు ముందడుగు పడలేదు.

### నాటికీ..నేటికీ ఎంతో తేడా..

గత కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వాయు వేగంతో ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులను చేపట్టి చాలా ప్రాంతాల్లో సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేసింది. ఏటా రూ.600-700కోట్ల మేర నిధులను ఖర్చు చేసి ఫ్లై ఓవర్లు, ఆర్వోబీ, ఆర్‌యూబీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. .42 ఫ్లై ఓవర్లలో 37 చోట్ల ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన అధికారులు.. కేసీఆర్ హయాంలో 60 శాతానికి పైగా పూర్తి చేసుకున్న 23వ ఫ్లై ఓవర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. రూ.178 కోట్ల వ్యయంతో చేపట్టిన గచ్చిబౌలి శిల్పా లే అవుట్ ఫేజ్-2 ఫ్లైవర్ అందుబాటులోకి రానున్నది.

## దివ్యాంగ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, జూన్ 9 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం18వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏ రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ, తెలంగాణ వికలాంగుల సహాయక సమితి ద్వారా ఈ ఉపకరణాలు మంజూరు చేస్తారని అన్నారు. అర్హత కలిగిన దివ్యాంగులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని, సందేహాల నివృత్తి కోసం హెల్ప్ లైన్ నెంబర్ 155326ను సంప్రదించాలని ఆయన సూచించారు.హైదరాబాద్ జిల్లాకు రెట్రోఫిట్మెంట్ స్కూటీలు-102, బ్యాటరీ వీల్ ఛైర్లు-31, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిళ్లు-41, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో-03, హైబ్రీడ్ వీల్ ఛైర్లు-10, ల్యాప్‌టాప్‌లు-48, ట్యాబ్‌లు-24, 5జీ స్మార్ట్‌ఫోన్-05, చేతికర్రలు-53, వీల్‌చైర్లు-12, చెవిటి యంత్రం-05, ట్రైసైకిళ్లు-12,స్మార్ట్‌కేన్స్-25, ఎంసీఆర్ చెప్పులు-25, క్రచెస్-53 కేటాయించారని వెల్లడించారు.

# ఈఎస్ఐ దవాఖానల బాకీ ₹80 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)




మందులు, 105 రకాల సర్జికల్ మెటీరియల్‌ను సప్లయర్స్ అందిస్తున్నారు. ఏడాదికాలంగా నోడల్ కేంద్రాలకు అందించే మందులు, సర్జికల్ పరికరాలకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. 2024లో కేంద్రప్రభుత్వం ఈఎస్ఐ దవాఖానల కోసమని బడ్జెట్‌లో రూ.90 కోట్లను రాష్ట్రానికి కేటాయించి విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ మెడిసిన్ సప్లయర్స్‌కు చెల్లించాల్సిన రూ.65కోట్ల బకాయిలు చెల్లించకుండా సప్లయర్స్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నది. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని సరఫరాదారులు ఎన్నిసార్లు బిల్లులు పెట్టుకున్నా స్టేట్ ఫైనాన్స్ వాటిని వెనక్కి పంపించడం గమనార్హం. వాస్తవానికి ఈఎస్ఐ దావఖానలకు ఏడాదికి రూ. 280కోట్లు కేటాయించి, ప్రతి ఆరునెలలకోసారి చెల్లిస్తుంటారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఎప్పటికప్పుడు చెల్లించినా, నేడు కాంగ్రెస్ పాలనలో మాత్రం పెండింగ్‌లో పెడుతున్నారు. 2024 అక్టోబర్‌లో రూ.30 కోట్లు మందులకు , రూ.5 కోట్లు సర్జికల్ మెటీరియల్ కోసం విడుదల చేసినట్లు ప్రకటన చేసిన ప్రభుత్వం.. వాటిని ఇప్పటివరకు చెల్లించలేదు. వాటితో పాటు ఇటీవల మరో రూ.30కోట్లు పెండింగ్ బకాయిలు పడ్డది. మొత్తం కలిపి రూ. 65 కోట్ల పెండింగ్ బకాయిలను ఈఎస్ఐ దవాఖానలకు మందులు, సర్జికల్ మెటీరియల్ సప్లై చేసే ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ మెడిసిన్ సప్లయర్స్‌కు చెల్లించాల్సి ఉండగా, వారికి మొండిచేసి చూపించింది.

### జీవోఐ బకాయిలు రూ.15కోట్లు..

ఈఎస్ఐ దవాఖానలకు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ మెడిసిన్ సప్లయర్స్‌తో పాటు గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు(జీవోఐ)కి చెందిన కర్నాటక, ఒడిశా, గోవా యాంటీబయోటిక్స్ వాళ్లు సైతం రాష్ట్రంలోని ఈఎస్ఐ దవాఖానలకు మందులు అందిస్తున్నారు. ఆ సంస్థలకు సైతం ఇప్పటివరకు 15కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాటికోసం అధికారులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి పేను కుట్టినట్లైనా లేదు. పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఇప్పటికే ముఖ్యమైన పలు రకాల మందులు, సర్జికల్ మెటీరియల్ సరఫరా నిలిచిపోయింది. దాంతో వైద్యంకోసం వచ్చే ఈఎస్ఐ రోగులపై తీవ్ర భారం పడుతోంది. కావాల్సిన మందులు అందుబాటులో లేకపోవడంతో చేతి నుంచి డబ్బులు పెట్టి మరీ ప్రైవేట్ ఫార్మసీలో కొనుగోలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా సర్జికల్ మెటీరియల్ కొరత కారణంగా రోగులు రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తున్నది. ఈఎస్ఐ కార్డుతో వచ్చే రోగుల్లో తాత్కాలిక రోగులకంటే దీర్ఘకాలిక రోగులే అధికంగా ఉంటారు. శ్వాస సంబంధిత రోగులకోసం ఇంటివద్ద వాడుకునే మెషిన్లు సైతం గతంలో అందించేవారు. ప్రస్తుతం వాటి కొరత కారణంగా రోగులు అవస్తలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగా ఆరోగ్యరంగం నిర్వీర్యమవుతుందన్న వాదనలు రోగుల నుంచి వస్తున్నాయి.

### బకాయిలకోసం ఎదురుచూపులు..

కేబీ రామచంద్ర, ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఏడాదికాలంగా పెండింగ్ బిల్లులు ఇప్పించాలని విన్నవించుకున్నా కూడా అధికారులు స్పందించడం లేదు. బిల్లులు రాసి స్టేట్ ఫైనాన్స్‌లో రిజెక్ట్ చేస్తున్నారు. కేంద్రం విడుదల చేసినా నిధులను కూడా మంజూరు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అందుకే ఈఎస్ఐలో సరఫరా నిలిపేశాం.

# బస్సులు పెంచమంటే..పాస్ ధరలు పెంచేశారు!

(మొదటిపేజీ తరువాయి)

వెల్లువెత్తుతున్నాయి. బస్సుపాస్‌లను నమ్ముకొని విద్యాసంస్థలు, కార్యాలయాలకు చేరుకుంటున్న వారిని నట్టేట ముంచేలా వివిధ రకాల బస్‌పాస్‌లపై 24 నుంచి 50 శాతం వరకు ధరలు పెంచింది. గ్రేటర్‌లో సుమారు 3.12లక్షల బస్‌పాస్‌లు ఉన్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, టూరిస్టులు, రోజువారి ప్రయాణికులు ఆర్టీసీ బస్ పాస్‌లను తీసుకుంటారు. నెలవారీ, త్రైమాసిక ఇలా పాస్‌లను పొందుతారు. అయితే బస్ పాస్ ధరలను పెంచడంపై ప్రయాణికులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఇదేం తరీఖా..?

బస్సులు విద్యార్థుల ప్రయాణం కారణంగా రద్దీని తలపిస్తున్నాయంట. అందుకోసం వారికి బస్సు పాస్ ధరలు ఆర్టీసీ పెంచింది. అయితే పెంచిన ధరతో ఆర్టినరీ బస్సుతో పాటు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో కూడా ఎక్కొచ్చని ఉచిత సలహా ఇచ్చింది. కానీ మహాలక్ష్మి ఉచిత పథకం మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో కూడా వర్తిస్తుందని.. ఆ బస్సులన్నీ రద్దీని తలపిస్తున్న విషయం ఆర్టీసీ ఉన్నతాధికారులకు తెలియకపోవడం బాధకరం. మహాలక్ష్మి ఉచిత పథకం నష్టాన్ని విద్యార్థులపై ప్రభుత్వం మోపిందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. మరో రెండు రోజుల్లో పాఠశాలలు, 20 రోజుల్లో కాలేజీలు ప్రారంభం కానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల బస్ పాస్‌లను సైతం పెంచడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నెలవారీ స్టూడెంట్ పాస్ రూ.400 ఉంటే ప్రస్తుతం 200 పెంచుతూ రూ. 600 చేశారు. త్రైమాసిక పాస్ 1200 ఉంటే ఇప్పుడు 1800 అయింది. గ్రేటర్‌లో 1.50 లక్షల స్టూడెంట్ బస్ పాస్‌లున్నాయి. నెలవారీ రూ.400 ధరతో రూ.6 కోట్లు ఆర్టీసీకి ఆదాయం వస్తుంది. ఇప్పుడు పెరిగిన రూ.600తో 9 కోట్ల ఆదాయం వస్తుంది. అదనంగా రూ.3 కోట్లు విద్యార్థులపై సర్కార్ భారం మోపడం బాధాకరమని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. సిటీ ఆర్డినరీ, మెట్రో డీలక్స్‌లో ఉచిత మహాలక్ష్మి పథకం కొనసాగుతుంది. ఈ దృష్ట్యా ఆ బస్సులన్నీ రద్దీని తలపిస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు అదనంగా చేకూరే లాభం ఏమీ లేదంటూ విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి.

### బస్సులు సంఖ్య పెంచండని..!

గ్రేటర్‌లోజనాభ కోటి మించింది. ఈ పరిస్థితిలో వారి రాకపోకలకు నగరంలో కనీసం 7వేల బస్సులు సమకూర్చాల్సిన అవసరం ఉందని ఇప్పటికే రవాణా రంగ నిపుణులు నివేదికలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ బస్సుల సంఖ్య గ్రేటర్ జనాభాకు తగ్గట్టు పెంచలేదు. ఆర్టీసీ నష్టాల కారణంగా బస్సుల సంఖ్య పెంచలేకపోతున్నామంటూ అధికారులు చెబుతున్నారు. గ్రేటర్‌లో 3100 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. 30వేల ట్రిప్పులు కొనసాగుతున్నాయి. మహాలక్ష్మి ఉచిత బస్సు స్కీం రాక ముందు గ్రేటర్‌లో ఒక్క రోజుకు 11 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేసేవారని అధికారులు చెబుతున్నారు. ఉచిత ప్రయాణం వచ్చాక ఒక్క రోజుకు 21 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. రెట్టింపు స్థాయిలో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులన్నీ రద్దీని తలపిస్తున్నాయి. దీంతో మధ్య స్టాపుల్లో ఉన్న ప్రయాణికులు బస్సు ఎక్కాలంటేనే నిల్చొవడానికి కూడా స్థలం దొరకని దుస్థితి . దీంతో బస్సుల సంఖ్య పెంచి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రయాణికులు అధికారులను కోరుతూ అనేక వినతి పత్రాలు సమర్పించారు. లక్ష సంతకాల ఉద్యమం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు బస్సులు సమయానికి రావడం లేదనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి.

**పెరిగిన బస్ పాస్ ధరలు..నెలవారీగా..!**

| పాస్ | పాత ధర | ప్రస్తుత ధర (రూ.లో) |
|---|---|---|
| స్టూడెంట్ బస్ పాస్ | 400 | 600 |
| ఆర్డినరీ | 1150 | 1400 |
| మెట్రో ఎక్స్‌ప్రెస్ | 1300 | 1600 |
| మెట్రో డీలక్స్ | 1450 | 1800 |
| గ్రీన్ మెట్రో లగ్జరీ | 1900 | 2200 |

# చీఫ్ జస్టిస్‌ను సృష్టించి.. ₹1.34 కోట్లు కొట్టేసి

(మొదటిపేజీ తరువాయి)

అనే వ్యక్తి దుర్వినియోగం చేశాడు, అతనిని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో నవంబర్ 2, 2024న అరెస్ట్ చేశామన్నారు. అతడిని విచారించిన సమయంలో కంబోడియా, మయన్మార్, పిలిపిన్స్‌కు సైబర్ నేరాలు చేసేందుకు అక్రమంగా మనుషులను రవాణా చేస్తున్నట్లు వెల్లడయ్యింది.' ఈ నేపథ్యంలో మీ ఆధార్ కార్డుకున్న లింక్‌పై సీబీఐ కూడా దర్యాప్తు చేస్తుందని వివరించాడు. ఇప్పటి వరకు మీపై అనుమానంతోనే కేసు దర్యాప్తు జరుపుతున్నామని, సుప్రీంకోర్టు కూడా ఈ కేసు విచారణను పరిశీలిస్తుందని, రేపు మిమ్మల్ని సీబీఐ ఆ డాక్యుమెంట్లతో విచారిస్తుందంటూ ఫోన్ పెట్టేశాడు. కొద్దిసేపటి తరువాత సీబీఐ అఫీస్ పేరుతో కొన్ని డాక్యుమెంట్లు పంపించారు, సుప్రీంకోర్టు లోగో, ఢిల్లీ, కర్ణాటక పోలీస్, సీబీఐ పోలీసుల విచారణకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవన్నీ అంటూ ఫేక్ డాక్యుమెంట్లు వాట్సాప్ చేశారు. అందులో అరెస్ట్ వారెంట్ కూడా జారీ కావడానికి సిద్ధంగా ఉన్న ఒక డాక్యుమెంట్ సైతం ఉంది. దానిని చూపించిన నకిలీ సీబీఐ అఫీసర్.. మీరు అరెస్ట్ నుంచి తప్పించకోవాలంటే.. మీకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, మనీ లాండరింగ్‌కు పాల్పడలేదని, ఇతర ప్రాంతాల నుంచి డబ్బురాలేదని రుజువు చేసుకోవాల్సి ఉంటుందని, అందుకు సుప్రీంకోర్టు రిజిస్టర్‌కు సంబంధించిన వివరాలు మేం ఇస్తాం.. అక్కడికి మీ బ్యాంకు వివరాలు పంపించండి , అవసరమైతే ఆర్టీజీఎస్ ద్వారా మీ ఖాతాలో ఉన్న డబ్బు సుప్రీంకోర్టు ఖాతాకు పంపించి, మీకు ఈ కేసుతో సంబంధం లేదని నిర్ధారణ అయిన తరువాత కోర్టు నుంచి నేరుగా మీ బ్యాంకు ఖాతాలోకి డబ్బు తిరిగి డిపాజిట్ చేయించుకోండంటూ సూచన చేశాడు. మీరు రేపు వీడియో కాల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు మాట్లాడాల్సి ఉంటుందని, తెల్ల దుస్తులు వేసుకొని వీడియో కాల్‌లో మాట్లాడేందుకు సిద్ధంగా ఉండాలని, ఆయన చీఫ్ జస్టిస్ కావడంతో వీడియో కాల్‌లోకి రావడంతోనే మీరు పైకి లేచి నిల్చుని నమస్కారం చేయాలంటూ సూచించారు. అది నిజమని నమ్మిన బాధితుడు అతడి భార్య మరుసటి రోజు వీడియో కాల్ రావడంతోనే అప్రమత్తమయ్యాడు.

### మీ ఖాతాలు అసెస్‌మెంట్ చేయాలి..!

సైబర్‌నేరగాళ్లు వీడియో కాల్‌లో జడ్జీలా మాట్లాడారు..'మీపై తీవ్రమైన ఆరోపణలున్నాయి.. మిమ్మల్ని అరెస్ట్ చేయాల్సి ఉంటుందం'టూ బెదిరించారు. అయితే మీరు అమాయకులు అయ్యేందుకు కూడా అవకాశముందని, పోలీసులు చెప్పేదీ ఏకపక్షంగా నమ్మంలేమంటూ మాట్లాడారు. ఇందుకు మీ బ్యాంకు ఖాతాలు అసిస్‌మెంట్ చేస్తే సరిపోతుందని, రెండు రోజులో ఈ అసెస్‌మెంట్ పూర్తిచేయాలని, సుప్రీంకోర్టు నేతృత్వంలో ఇది జరుగుతుందంటూ హామీ ఇచ్చాడు. మీరు సుప్రీంకోర్టుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసే మొత్తం తిరిగి రిఫండ్ అవుతుందని భయపడాల్సిన పనిలేదంటూ భరోసా ఇచ్చారు. ఇది నిజమని నమ్మిన బాధితుడు తన మూడు ఖాతాల్లో ఉన్న రూ. 1.34కోట్ల డబ్బును ఈ నెల 2, 3వ తేదీల్లో సైబర్‌నేరగాళ్ల ఖాతాలోకి బదిలీ చేశాడు. ఆ తరువాత ఎలాంటి ఫోన్లు రాకపోడంతో ఇదంతా మోసమని గుర్తించి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.